# 'శాస్త్రి'యంగా...



అది 1963, మాస్టర్ ఇ.కె. (ఎక్కిరాల కృష్ణమాచార్యులు) తన వద్దకు వచ్చిన రోగులకు హోమియో చికిత్స చేస్తున్నారు. ఆయన ఎదురుగా ఒక యువకుడు. మాస్టర్ వైద్య విధానాన్ని తదేక దృష్టితో గమనిస్తున్న అతణ్ణి గమనించి 'బాబూ- నువ్వు ఈ వైద్యం నేర్చుకుంటావా?' అని ఈకే అడిగారు. దానికి అతను మౌనంగా తల ఊపాడు. తదాదిగా ఆయన శిష్యరికంలో హోమియో వైద్య విధానం లోతుల్ని అనతికాలంలోనే అవగతం చేసుకుని మాస్టర్ లేని సమయాల్లో కూడా డిస్పెన్సరీని నడుపగలిగే సామర్థ్యం సంపాదించుకున్నాడు. ఆయనే ఇప్పటి వరల్డ్ టీచర్స్ ట్రస్టు, బాలభాను విద్యాలయం చైర్మన్ డాక్టర్ కొంపెల్లసత్యనారాయణ శాస్త్రి (కె.ఎస్.శాస్త్రి). నిత్యం పాలనురుగులాంటి ధవళవస్త్రాలు ధరించి, చెరగని చిరునవ్వుతో ఎందరికో ఆరోగ్యదానం చేస్తున్న ఆ నిస్వార్థమూర్తి ముదిమి మీద పడినా తన చుట్టూ ఉన్న వారికి స్ఫూర్తి కలిగిస్తూ ఎందరికో స్వస్థత చేకూరుస్తున్నారు. ఆ సేవా స్ఫూర్తి-హానీమాన్ జయంతి సందర్భంగా తన గురువు ఈకే అడుగుజాడల్లో నడుస్తూ రోగుల సేవకు పునరంకితమవుతున్నారు. రైల్వేలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా దేశంలోని వివిధ ప్రాంతాల్లో తిరిగి 1963 నుంచి విశాఖపట్నంలోనే స్థిరపడ్డ శాస్త్రి 'న్యూస్‌లైన్'తో ముచ్చటించారు.

- 1963లో ఇ.కె. శిష్యరికం చేసి 1975లో పట్టా తీసుకుని హోమియో వైద్య రంగంలోకి పూర్తి స్థాయిలో అడుగుపెట్టాను. అప్పటి నుంచి ఒక్కపైసా కూడా ఆశించకుండా రోజుకి 200 నుంచి 250 మంది వరకూ రోగులకు ఉచిత వైద్య సలహాలు, మందులు అందజేస్తున్నాం.
- ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు గ్రామాల్లో హోమియో వైద్యాలయాలు ప్రారంభించి ఉచిత వైద్య సేవలందిస్తున్నాం. పలు పల్లెల్ని దత్తత తీసుకుని విద్య, వైద్య రంగాల్లో ఆ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నాం. జామి మండలం లొట్లపల్లిలో రామాలయాన్ని నిర్మించాం. ఆ గ్రామాభివృద్ధికి తోడ్పడుతున్నాం.
- గతంలో కంటే ఇప్పుడు హోమియో వైద్య విధానానికి ఆదరణ బాగా పెరిగింది. మా దగ్గరికి వస్తున్న రోగుల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతుండటమే దానికి ఉదాహరణ. డాక్టర్ పి.సాంబమూర్తి ప్రతి ఆదివారం అక్కయ్యపాలెంలోని హోమియో డిస్పెన్సరీకి వచ్చి వైద్య సేవలందిస్తుండగా, డాక్టర్ టి.జ్యోతిర్మయి ప్రతి ఆదివారం ఉచిత నేత్ర వైద్యశాలను నిర్వహిస్తున్నారు. పేద నేత్ర రోగులకు ఉచితంగా కళ్లజోడు కూడా ఇస్తున్నాం.
- మేము అనుసరిస్తున్నది హానీమన్ నిర్దేశించిన సంప్రదాయ, శాస్త్రీయ హోమియో విధానం. అదే పద్ధతి ఇప్పటికీ కొనసాగిస్తున్నాం.

**కాలేజీ స్థాపించాలి:**

విశాఖ జిల్లాలో హోమియో కాలేజీ లేకపోవడం శోచనీయం. రాజమండ్రిలో ఉన్న హోమియో కళాశాలకు పెరుగుతున్న ఆదరణ గమనించైనా జిల్లాలో ఒక హోమియో కాలేజీ నెలకొల్పవలసిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించాలి. డిప్లమా/డిగ్రీ సర్టిఫికెట్ కోర్సులను ప్రవేశపెడితే కాలేజీలో చేరేవారు చాలామంది ఉంటారు. కనీసం పార్ట్‌టైం కాలేజీ అయినా స్థాపించాలి.